



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
28-10-2025
పేజీలు: 02


## SPS నుండి IPS వరకు: ముగ్గురు అధికారులు ఘనమైన ఆరంభం

తెలంగాణ రాష్ట్ర సర్వీస్‌లోని ముగ్గురు పోలీస్ అధికారులకు ఐపీఎస్ (IPS) కన్ఫర్మ్ పదోన్నత లభించిందని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది.ఈ ముగ్గురు పోలీసులు ఎస్. శ్రీనివాస్, కే. గుణశేఖర్, డీ. సునీతలు. వీరిలో ఎస్. శ్రీనివాస్ మాజీ సీఎం సెక్యూరిటీ వింగ్ చీఫ్‌గా సేవలందించినారు. కన్ఫర్మ్ ఐపీఎస్ పదోన్నత అంటే, రాష్ట్ర పోలీస్ సర్వీస్‌లో ఉన్న అధికారులను భారతీయ పోలీస్ సేవలో ప్రోమోట్ చేయడం. ఇది సాధారణ ప్రక్రియ. UPSC ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ అర్హత ఉన్న SPS (State Police Service) అధికారుల పేర్లను పరిశీలించి, వారిని IPS స్థానంలో ప్రమోట్ చేయాలని నిర్ణయిస్తుంది. ఈ పదోన్నతతో వీరు అధికారికంగా ఐపీఎస్ అధికారులుగా గుర్తింపు పొందుతారు.



## మూడోసారి దేశాధ్యక్షుడినవుతా డోనాల్డ్ ట్రంప్

మూడోసారి కూడా అమెరికా దేశాధ్యక్ష పదవికి పోటీ పడేందుకు డోనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2028లో ఆ దేశ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అయితే అమెరికా రాజ్యాంగం ప్రకారం మూడోసారి దేశాధ్యక్ష పదవికి ఎవరైనా అనర్హులు. కానీ ట్రంప్ మూడోసారి కూడా అధ్యక్ష హోదాను చేపట్టే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల వైట్‌హౌజ్ స్ట్రాటజిస్ట్ స్టీవ్ బానన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. అలా చేయడానికి ఇష్టపడుతానని, తన వద్ద సంఖ్యా బలం ఉన్నట్లు చెప్పారు. కానీ నిజంగా దాని గురించి తానేమీ ఆలోచించడం లేదని కూడా అన్నారు. తన పదవీకాలం ముగిసిన తర్వాత రిపబ్లికన్ పార్టీని నడిపించే అవకాశాలు ఉన్న నేతల పేర్లను ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం విదేశాంగ మంత్రిగా ఉన్న మార్కో రూబియో, ఉపాధ్యక్షుడిగా ఉన్న జేడీ వాన్స్.. రిపబ్లికన్ పార్టీ వారసత్వాన్ని స్వీకరించే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ పేర్కన్నారు. 2028 ప్రెసిడెన్షియల్ రేసులో వాళ్లు ఉండే అవకాశం ఉందన్నారు. తమ వద్ద మంచి వ్యక్తులు ఉన్నారని, తానేమీ మళ్లీ పోటీ చేయాల్సిన అవసరం లేదని ట్రంప్ అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఎవరైనా దేశాధ్యక్ష పదవిని కేవలం రెండు సార్లు మాత్రమే చేపట్టే అవకాశం ఉన్నది. అయితే రాజ్యాంగంలో మార్పులు తెచ్చి మూడోసారి ట్రంప్ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల వ్యూహకర్త బానన్ తెలిపారు. దీంతో ఈ అంశంపై చర్చ జరిగింది.

## తీవ్ర తుఫానుగా రూపాంతరం..కాకినాడ వైపు

# దూసుకొస్తున్న మొంథా

మొంథా తుఫాను కాకినాడ వైపు దూసుకొస్తున్నది. గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న తుఫాను, మరికొద్దిసేపట్లో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని, దాదాపు 18గంటల పాటు ప్రభావం చూపనుందని పేర్కొంది. దీంతో కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. మొంథా తుఫాను ప్రస్తుతం మచిలీపట్నంకి 230కి.మీ. దూరంలో, కాకినాడకి 310కి.మీ., విశాఖకు 370కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్నది. తీరం వెంబడి గంటకు 90-110 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, నెల్లూరు, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 95 ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు రికార్డయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని విపత్తు నిర్వహణశాఖ అధికారులు సూచించారు. విజయవాడలో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఏపీలో 17 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. తుఫాను ప్రభావంతో ఉప్పాడ తీరంలో భారీగా అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్



రోడ్డు ధ్వంసమైంది. కెరటాల తీవ్రతకు భారీ రాళ్లు రహదారిపై ఎగసిపడుతున్నాయి. తీర ప్రాంత గ్రామాలపై అలలు విరుచుకుపడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కోతకు గురైన ఇండ్లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా, కోనసీమ జిల్లావ్యాప్తంగా అర్ధరాత్రి నుంచి వాన కురుస్తున్నది. దీంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడింది. సముద్ర తీరప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొంథా తుపాను ప్రభావంతో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతికి వచ్చే 30కిపైగా విమానాలను రద్దు చేశారు. అదేవిధంగా 97 రైలు సర్వీసులు రద్దయ్యాయి. ఇక విశాఖకు వచ్చే 16 రైళ్లను అధికారులు క్యాన్సల్ చేశారు. ఇండిగో, ఎయిరిండియా సంస్థలు కూడా తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి.

**మొంథా అలర్ట్.. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు!**

తీవ్ర తుఫానుగా రూపాంతంర చెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు 270 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొంథా తుఫాను.. మచిలీపట్నం-కాకినాడ మధ్య మంగళవారం సాయంత్రం తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నాలుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక మొంథా ప్రభావంతో మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 21 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, జనగామ, ఖమ్మం, కొమురంభీం, మంచిర్యాలలో ఓ మోస్తరు కురుస్తాయి.



## హరీష్ రావు ఇంట్లో విషాదం

మాజీ మంత్రి హరీష్ రావు ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి చెందారు. దీంతో తన్నీరు కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు, నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హరీష్ రావు ఇంటికి చేరుకుంటున్నారు. హైదరాబాద్‌లోని క్రిన్‌స్‌విల్లాస్‌లో సత్యనారాయణ పార్థివదేహాన్ని ఉంచినట్లు సమాచారం.

## రూ.20 సమోసా తింటే.. రూ.3 లక్షల బిల్లు!


జంక్ ఫుడ్ తినడానికి ఇష్టపడే వారికి ఇది బ్యాడ్ న్యూస్. ఢిల్లీకి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శైలేష్ సింగ్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మీరు తక్కువ ధరకే దొరుకుతుందని తింటున్న అనారోగ్యకరమైన ఆహారం చివరకు మీ జేబుకు రూ. 3 లక్షల మేర చిల్లు పెడుతుందని ఆయన అన్నారు. కాస్త హాస్యాన్ని జోడించి ఆయన చేసిన ఈ ఆరోగ్య హెచ్చరిక ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**రూ. 90 వేల సమోసా.. రూ. 3 లక్షల అప్పు**

మీరు రోజుకు రూ.20 పెట్టి సమోసా లాంటివి తింటే.. 15 ఏళ్లకు మీకు సుమారు రూ. 90,000 ఖర్చవుతుంది. కానీ అసలు ఖర్చు అది కాదు.. మీరు తినే ఈ అనారోగ్యకరమైన ఆహారం మీ గుండె రక్తనాళాలను పాడు చేస్తుంది. దీనిని ఆయన 400 శాతం వడ్డీతో అప్పు తీసుకోవడంగా అభివర్ణించారు. చివరికి ఈ అప్పును మీరు రూ.3 లక్షల యాంజియోప్లాస్టీ ఆపరేషన్ ద్వారా తీర్చాల్సి వస్తుందని డాక్టర్ సింగ్ హెచ్చరించారు. ఈ హెచ్చరిక ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

**అలవాట్లు మార్చుకోండి**

అనారోగ్యకరమైన అలవాట్ల నుండి




ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎలా మారవచ్చో కూడా డాక్టర్ సింగ్ వివరించారు. ఈ మార్పు ప్రారంభంలో కష్టంగా అనిపించినా, దానిని కొనసాగిస్తే అది రోజువారీ అవసరంగా మారుతుందని అన్నారు. డాక్టర్ సింగ్ మాట్లాడుతూ.. ''వాకింగ్ ప్రారంభించిన మొదటి వారం కష్టంగా అనిపించవచ్చు. కానీ 52వ వారం వచ్చేసరికి.. వాకింగ్ చేయకుండా ఉండటం మీకు మరింత కష్టంగా అనిపిస్తుంది. కష్టపడితే కేవలం ఏడు రోజులు మాత్రమే అసౌకర్యం ఉంటుంది.. కానీ పశ్చాత్తాపం మాత్రం జీవితాంతం ఉంటుంది. మీ కష్టాన్ని మీరే ఎంచుకోండి'' అని ప్రజలకు సూచించారు.


**గుండెకు హాని ఎలా..?**

సమోసా లాంటి వేయించిన, తీపి పదార్థాల్లో ఉండే కొవ్వు, చక్కెరలు మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, కొవ్వు స్థాయిలను పెంచుతాయి. ఇవి రక్తనాళాలలో పేరుకుపోయి, గుండె జబ్బులకు దారి తీస్తాయి. జంక్ ఫుడ్ వల్ల ఊబకాయం కూడా పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి అనేక సమస్యలకు కారణం అవుతుంది. అందుకే జంక్ ఫుడ్ మానేసి పండ్లు, కూరగాయలు తినడం అలవాటు చేసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.



## ఆ పాత్ర కోసం ఆరు గంటల మేకప్ ..

# రిషబ్ శెట్టి డెడికేషన్‌కి హ్యాట్సాఫ్



కాంతార చాప్టర్ 1 విడుదలైనప్పటి నుండి ప్రేక్షకులు నుండి విమర్శకుల వరకు అందరూ హీరో రిషబ్ శెట్టి నటనను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. బెర్మే పాత్రలో ఆయన చూపిన ఇంపాక్ట్ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ''ఆ పాత్రను రిషబ్ కాకుండా మరెవరూ చేయలేరు'' అని అభిమానులు, సినీ ప్రముఖులు ముక్తకంఠంతో చెబుతున్నారు. 'కాంతార'తో ఇప్పటికే నేషనల్ అవార్డు అందుకున్న ఆయన, ఈ ప్రీక్వెల్‌తో మరోసారి ఆ అవార్డు జాబితాలో చోటు దక్కించుకోవడం ఖాయమని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే సినిమా ప్రారంభంలో, మధ్యలో, క్లైమాక్స్‌లో కనిపించే మాయావి (మాయ కర) పాత్రలో ఎవరు నటించారు? అనే సందేహానికి ఇప్పుడు సమాధానం లభించింది. ఆ పాత్రలలో రిషబ్ శెట్టి నటించాడు అని స్వయంగా నిర్మాణ సంస్థ హోంబలే ఫిలిమ్స్ ప్రకటించింది. వారు రిలీజ్ చేసిన వీడియోలో రిషబ్ మేకప్ ప్రక్రియను చూపించారు. మాయావి పాత్ర మేకప్ కోసం సుమారు 6 గంటలు పట్టిందట. తెల్లవారుజామున ఆరు గంటలకే రిషబ్ షూటింగ్ స్పాట్‌కు చేరి, ఉదయం తొమ్మిదివరకు కుర్చీలో కూర్చొని మేకప్ చేయించుకున్నారని హోంబలే ఫిలిమ్స్ తెలిపింది. ఈ వీడియోలో రిషబ్ శెట్టి చూపిన డెడికేషన్, కమిట్మెంట్ చూసి ప్రేక్షకులు మెచ్చుకుంటున్నారు. 'కాంతార చాప్టర్ 1'లో రిషబ్ ఒకేసారి బెర్మే మరియు మాయావి అనే రెండు విభిన్న పాత్రలు పోషించారు. ఈ రెండు పాత్రల మధ్య ఉన్న తేడాను ఆయన అద్భుతంగా ప్రదర్శించారని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ''ఈ స్థాయి నటనకు మరోసారి నేషనల్ అవార్డు రావడం ఖాయం'' అని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.



## ఆస్ట్రేలియా కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా త్వరలోనే యాషెస్ సిరీస్ ఆడనుంది. స్వదేశంలో నవంబర్ 21 నుంచి మొదలవ్వనున్న ఈ సిరీస్ తొలి పోరుకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. వెన్ను గాయంతో బాధ పడుతున్ అతడు పెర్త్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదు. దాంతో.. సీనియర్ బ్యాటర్ అయిన స్టీవ్ స్మిత్ మొదటి టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సోమవారం క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. సుదీర్ఘ ఫార్మాట్‌లోని గొప్ప సమరాల్లో ఒకటైన యాషెస్ సిరీస్‌కు ఈసారి ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇస్తోంది. స్వదేశంలో చెలరేగిపోయే ఆసీస్ ఈసారి కూడా ఇంగ్లండ్‌ను చిత్తు చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే.. ఆరంభ మ్యాచ్‌కు కెప్టెన్ కమిన్స్ దూరమవ్వడం ఆ జట్టుకు కొంత ఇబ్బందికరమే. ఎందుకంటే.. తనవైన వ్యూహాలతో ప్రత్యర్థిని దెబ్బతీసే కమిన్స్ బంతితో, బ్యాటుతోనూ రాణించగల సమర్థుడు. వెన్ను గాయంతో వరుసగా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు దూరమైన ప్యాటీ.. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నాడు. గబ్బాలో డిసెంబర్ 4న జరుగనున్న రెండో టెస్టులోపు ఫిట్‌నెస్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు కమిన్స్. ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్ డొనాల్డ్ సైతం అతడు గబ్బాలో ఆడుతాడనే ఆశాభావంతో ఉన్నాడు.

## అల్లు అర్జున్‌అట్లీ కాంబో సినిమాలో

# బుట్టబొమ్మకు భారీ ఆఫర్

సినీ ఇండస్ట్రీలో బుట్టబొమ్మ పూజా హెగ్డే గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. హీరోయిన్‌గా బిజీగా ఉంటూనే ఐటెం సాంగ్స్ ద్వారా కూడా తన ప్రత్యేకతను చాటుకుంటుంది. మొన్నటికి మొన్న రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన ''కూలీ'' సినిమాలో ''మోనికా లవ్ యూ మోనికా'' పాటతో ప్రేక్షకులను అలరించిన పూజా హెగ్డే, ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్ కోసం సిద్ధమవుతున్నట్లు సమాచారం. పూజా ''రంగస్థలం''లో ''జిగేల్ రాణి''గా కూడా మెరిసింది. ఆ తర్వాత ''F3''లో కూడా స్పెషల్ సాంగ్‌లో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. హీరోయిన్‌గా లీడ్ రోల్స్ చేస్తూనే మరోవైపు ఐటెం సాంగ్స్ చేస్తూ రెండు వైపులా క్రేజ్, సంపాదన పెంచుకుంటోందని టాక్.


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## భారీగా ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైన అమెజాన్




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీగా ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. ఏకంగా 30వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. తాజా తొలగింపులు కంపెనీ చరిత్రలోనే అతిపెద్దదిగా ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. అమెజాన్‌లో 3.5 లక్షల మంది కార్పొరేట్ ఉద్యోగులు ఉన్నారు. ఇది ఆ కంపెనీలోని మొత్తం ఉద్యోగుల్లో 10 శాతం. 2020 తర్వాత కంపెనీలో ఈస్థాయిలో లేఆఫ్స్ జరగడం ఇదే తొలిసారి అని టెక్ వర్గాలు చెబుతున్నాయి. 2022 చివరి నుంచి దాదాపు 27వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. ఇప్పుడు ఏకంగా 30 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు కంపెనీ సిద్ధమైనట్లు నివేదికలు వెల్లడించాయి. ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ఈ తాజా లేఆఫ్‌ల నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ లేఆఫ్స్ కంపెనీలోని మానవ వనరులు, ఆపరేషన్స్, డివైజెస్, సర్వీసులు సేవల విభాగాలతో సహా మరికొన్ని ప్రభావితం కానున్నట్లు తెలుస్తోంది. ఒక్క మానవ వనరుల విభాగంలో ఈసారి 15 శాతం మంది తమ జాబ్ కోల్పోయే ప్రమాదం ఉంది.

## వెయిట్ లిఫ్టింగ్‌లో అదరగొట్టిన ఢిల్లీ లేడీ కానిస్టేబుల్




పట్టుదల సంకల్ప బలం ఉంటే శారీరక అవరోధాలు కూడా తలవంచాల్సిందేనని ఓ మహిళా పోలీస్ కానిస్టేబుల్ నిరూపించారు. ఏడు నెలల నిండు గర్భవతిగా ఉంటూనే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఏపీలో జరిగిన పోలీస్ పోటీల్లో ఢిల్లీకి చెందిన సోనికా యాదవ్ ఈ అరుదైన ఘనతను అందుకున్నారు. ఢిల్లీ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సోనికా యాదవ్‌కు వెయిట్ లిఫ్టింగ్ అంటే ఎంతో ఇష్టం. గతంలో అనేక పోటీల్లో పాల్గొని పతకాలు కూడా సాధించారు. పెళ్లయ్యాక కూడా తన సాధనను ఆపలేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గర్భం దాల్చినప్పటికీ, వైద్యుల పర్యవేక్షణలో తన శిక్షణను కొనసాగించారు. ఇటీవల ఏపీలో జరిగిన 'ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-2026' పోటీల్లో ఆమె పాల్గొన్నారు.ఏడు నెలల గర్భంతో పోటీలకు హాజరైన సోనికాను చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. ఆమె కేవలం సాధారణ విభాగంలో పాల్గొంటారని భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ145 కేజీల డెడ్ లిఫ్ట్, 125 కేజీల స్క్వాట్స్, 80 కేజీల బెంచ్ ప్రెస్ వంటి కఠినమైన విభాగాల్లో పాల్గొన్నారు. అత్యంత పట్టుదలతో పోటీపడి 145 కేజీల డెడ్ లిఫ్ట్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారు.ప్రస్తుతం సోనికా యాదవ్ విజయగాథ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె సంకల్ప బలాన్ని, కఠోర శ్రమను నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. సాధించాలన్న కసి ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదని సోనికా నిరూపించారంటూ కామెంట్లు పెడుతున్నారు.

# ఆస్తి రాయాలంటూ భార్య వేధింపులు..!

### 14వ అంతస్తు నుంచి కిందికి దూకిన ఐటీ ఉద్యోగి

హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది.. తాను ఉంటున్న నివాసం 14 అంతస్తు బిల్డింగ్ పై నుంచి దూకి ఇంజనీర్ మరణించాడు.. ఈ విషాద ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉంటున్న శ్రీనివాసరావు హుజూర్‌నగర్ వాసి. గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులోని స్థిరపడ్డాడు. స్థానికంగా నల్లగండ్లలో ఉన్న రాంకీ గెలాక్సీయా అపార్ట్మెంట్స్ లోని 14 అంతస్తులో ఆయన నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజులుగా భార్యతో తరచూ శ్రీనివాస్ రావు కి గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో ఇరు కుటుంబాల పెద్దమనుషులు వచ్చి ఇరువురికి నచ్చచెప్పి పంచాయితీ చేసినా ఫలితం లేదు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ నిరంతరం ఆస్తి విషయంలో గొడవలు అవుతూనే ఉండేవి. సోమవారం ఉదయం అపార్ట్మెంట్ 14 ఫ్లోర్ నుండి శ్రీనివాసరావు కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో ఘటన స్థలంలోనే శ్రీనివాసరావు మృతి చెందాడు. ఈ క్రమంలోనే.. శ్రీనివాసరావు మృతిపై అనుమానం ఉందని.. అతని తల్లి కమలమ్మ చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడు శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకోవడానికి తన కోడలు జ్యోతినే కారణం అంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్తులు మొత్తం తన పేరు మీద రాయాలని భర్త శ్రీనివాస్ రావు పై ఒత్తిడి తెచ్చింది. ఇదే శ్రీనివాసరావు ఆత్మహత్యకు కారణమని ఆయన తల్లి చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మానసిక ఒత్తిడికి గురైన శ్రీనివాసరావు తన భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకి చెప్పటంతో చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన



స్థలానికి చేరుకున్న చందానగర్ పోలీసులు శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఆయన భార్య జ్యోతి పాత్ర పైన చందానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ ప్రేమికుల కోసం లగ్జరీ మోస్టర్ బైక్!

### డుకాటి 2025 మల్టీస్ట్రాడా V2

డుకాటి 2025 మల్టీస్ట్రాడా V2 ను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఇది మిడ్-సైజ్ అడ్వెంచర్ టూరింగ్ విభాగానికి చెందిన బైక్. మల్టీస్ట్రాడా V2 890cc ఇంజిన్‌తో పనిచేస్తుంది, ఇది 115 హార్స్‌పవర్ శక్తి మరియు 95 Nm టార్క్ ఉత్పత్తి చేస్తుంది.బైక్ 19-లీటర్ పెట్రోల్ ట్యాంక్‌తో వస్తుంది. అందులో స్టార్మ్ గ్రీన్ మరియు డుకాటి రెడ్ కలర్ ఆప్షన్లు, అల్యూమినియం మోనోకోక్ ఫ్రేమ్, 17- మరియు 19-అంగుళాల అల్లాయ్ వీల్స్, బ్రెంబో బ్రేక్‌లు, పిరెల్లి టైర్లు ఉన్నాయి. బైక్‌లో ABS, DTC, DWC, DQS, EBC వంటి సేఫ్టీ ఫీచర్లు, ఐదు-అంగుళాల డిస్ప్లే, స్పోర్ట్, టూరింగ్, అర్బన్, ఎండ్యూరో, వెట్ రైడింగ్ మోడ్‌లు, హై, మిడ్, లో, ఆఫ్-రోడ్ పవర్ మోడ్‌లు, LED హెడ్‌లైట్‌లు, LED DRLలు, కమింగ్-హోమ్ ఫీచర్, క్రూయిజ్ కంట్రోల్, USB ఛార్జింగ్ పోర్ట్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి.ముందు 48 మి.మీ USD ఫోర్క్స్, వెనుక మోనోషాక్, రెండూ పూర్తిగా అడ్జస్టబుల్. ముందరి 320 మి.మీ డ్యూయల్ డిస్క్



బ్రేక్‌లకు బ్రెంబో M4.32 కాలిపర్స్, వెనుక 265 మి.మీ సింగిల్ డిస్క్ బ్రేక్ ఉన్నాయి.కంపెనీ భారత్‌లో మల్టీస్ట్రాడా V2 ను ఎక్స్-షోరూమ్ ధర రూ. 18.88 లక్షల నుండి ప్రారంభమయ్యే బేసిక్ వెర్షన్‌గా, టాప్-స్పెక్ వేరియంట్‌ను రూ. 21.29 లక్షలకు విడుదల చేసింది.




## మొంథా తుపాను నేపథ్యంలో మంత్రి నాదెండ్ల ఆదేశాలు

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 12 జిల్లాల్లో నవంబర్ నెలకు సంబంధించిన రేషన్ సరుకులను ముందుగానే పంపిణీ చేయాలని ఆదేశించింది. సాధారణంగా ప్రతి నెలా 1వ తేదీన ప్రారంభించే ఈ ప్రక్రియను ఈసారి అక్టోబర్ 28వ తేదీ నుంచే అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. తుపాను కారణంగా ప్రజలు నిత్యావసరాల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఈరోజు ఉదయం 9 గంటల నుంచే రేషన్ పంపిణీ ప్రారంభమైంది. ఈ జిల్లాల పరిధిలోని 14,145 రేషన్ దుకాణాల ద్వారా దాదాపు 7 లక్షల మంది లబ్ధిదారులకు సరుకులు అందజేయనున్నారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "సాధారణంగా నెల మొదటి రోజు నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. కానీ, తుపాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం.


# జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు కీలక భేటీ

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజనపై ఇవాళ(మంగళవారం) క్యాబినెట్ సబ్ కమిటీతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం కానున్నారు. ఉదయం 11 గంటలకు జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ సబ్ డివిజన్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం మ.12 గంటలకు రాష్ట్రంలో మొంథా తుఫాన్ పరిస్థితిపై అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాల పునర్విభజన కోసం ప్రభుత్వం గతంలో ఏడుగురు మంత్రులతో కూడిన ఓ ప్రత్యేక ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లాల సరిహద్దుల మార్పుపై వచ్చిన ప్రజా అభిప్రాయాలు, ప్రతిపాదనలు సేకరణ పూర్తయినట్లు సమాచారం. ఇప్పుడు వాటిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, గ్రామస్థాయి వార్డుల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలను స్వీకరించింది. మొత్తం 200లకు పైగా అర్జీలు కమిటీ దృష్టికి వచ్చినట్లు తెలిపింది.కాగా, వీటన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన కమిటీ వివిధ జిల్లాల్లోని కలెక్టర్లు, RDOలు, తహసీల్దార్ల అభిప్రాయాలను కూడా సేకరించింది. ఈ మేరకు సమావేశంలో సూచనలు, ప్రతిపాదనలు, ప్రస్తుత భౌగోళిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, జనాభా పంపిణీ వంటి అంశాలన్నింటిని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలిస్తారు. ప్రధానంగా ఆరు కొత్త జిల్లాల ఏర్పాటుపై ఉపసంఘం ముఖ్యమంత్రి చంద్రబాబుకి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే.. ఏపీలోని 26 జిల్లాలు కాస్త 32 జిల్లాలుగా



మారనున్నాయి. అయితే ఈ సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటారో.. అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# తప్పుడు ప్రచారంతో భయపెట్టొద్దు



తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రంలోని అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని, ప్రజల్లో భయాందోళనలను సృష్టించేలా సోషల్ మీడియాలో నకిలీ ప్రచారాలు చేయవద్దని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. సంచలన శీర్షికలతో ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించడం బాధ్యతా రాహిత్యమేనని తెలిపారు. సహాయక చర్యలకు ప్రభుత్వం పూర్తిగా సన్నద్ధమైందన్నారు. అయితే.. సోషల్ మీడియాలో పాత ఫోటోలు, వీడియోలు భయపెట్టేలా థంబ్ నెయిల్‌స్‌ను పెట్టి నకిలీ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పదేళ్ల క్రితం విశాఖలో వచ్చిన హుద్‌హుద్ తుఫాను మాదిరిగా.. ప్రస్తుత మొంథా తుఫాను కూడా ఉంటుందనే భయంతో ప్రజలు భీతిల్లుతున్నారని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే విషయమై అధికార వర్గాలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిందని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి కలెక్టర్లు, ఎస్పీలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో యూట్యూబ్ చానెళ్లు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా సంయమనం పాటించాలని సూచించారు. దురుద్దేశ పూర్వకంగా నకిలీ ప్రచారం చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.



## అనుపమ ప్రేమ వివాహంపై కీలక ప్రకటన

బైసన్ సినిమా ప్రమోషన్ల సందర్భంగా నటి అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడుతూ, తాను ప్రేమ వివాహం చేసుకుంటానని, అయితే తల్లిదండ్రులను ఒప్పించిన తర్వాతే పెళ్లి జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆరు సినిమాలతో కెరీర్‌లో మంచి జోరు మీదున్న అనుపమ, వ్యక్తిగత జీవితంలోనూ కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



గంగాధర పాఠశాల ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని

## పోలీసులకు ఆదేశించిన బండి సంజయ్

కరీంనగర్ జిల్లా గంగాధరలోని ఒక పాఠశాలలో అటెండర్ చేతిలో విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురైన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ విషయంపై కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. వెంటనే కరీంనగర్ గ్రామీణ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీయాలని ఆయన పోలీసులను ఆదేశించారు.గంగాధరలోని పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న యాకుబ్ అనే వ్యక్తి, బాలికల ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా, అసభ్యకరమైన వీడియోలు చూపిస్తూ విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు బాధితులు వాపోయారు. ఈ విషయం బయటకు తెలియడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.ఈ క్రమంలో దీనిపై స్పందించిన బండి సంజయ్ పోలీసులకు కీలక సూచనలు చేశారు. నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని పోలీసులు ఆయనకు వివరించారు.